
జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
మహబూబ్‌నగర్
నాగర్ కర్నూల్, వనపర్తి
జోగులాంబ గద్వాల
నారాయణపేట









# చదువుతో పాటు కళల్లోనూ రాణించాలి

## బాలభవన్ వేసవి శిబిరాన్ని ప్రారంభించిన కలెక్టర్



**గద్వాల మే 02(ప్రజా జ్యోతి ప్రతినిధి)** :విద్యార్థులు చదువుతో పాటు వివిధ కళల్లోనూ రాణించాలని,బాల భవన్‌లో అందించే శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ సూచించారు.గద్వాల బాల భవన్‌లో ప్రతి సంవత్సరం నిర్వహించే వేసవి శిక్షణ శిబిరాన్ని శనివారం ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు.ఈ సందర్భంగా బాల భవన్ వ్యవస్థాపకులు,ప్రముఖ స్వాతంత్ర సమరయోధులు,మాజీ ఎమ్మెల్యే పాగ పుల్లారెడ్డి 107వ,జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ,వేసవి సెలవుల్లో పిల్లలు సెల్‌ఫోన్లు,టీవీలకు పరిమితం కాకుండా బాల భవన్‌లో నేర్పించే శాస్త్రీయ,జానపద నృత్యం,చిత్రలేఖనం,సంగీతం వంటి కళల్లో శిక్షణ పొందితే భవిష్యత్తులో గొప్ప కళాకారులుగా ఎదగవచ్చున్నారు.ఒకే

# ప్రజా సంక్షేమమే లక్ష్యం

**- 99 రోజుల ప్రజాపాలనతో ప్రతి ఇంటికి వెలుగు**

**- నియోజకవర్గ స్థాయి సమావేశంలో విప్ యెన్నం శ్రీనివాస్ రెడ్డి**



**మహబూబ్‌నగర్, మే 2 (ప్రజా జ్యోతి బ్యూరో):** ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ప్రతి ఇంటికి వెలుగు చేరుతోందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. మహబూబ్‌నగర్ పట్టణంలోని బృందావన్ క్లాసిక్ గార్డెన్‌లో నిర్వహించిన "ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక -- 99 రోజుల కార్యక్రమం"లో భాగంగా జరిగిన నియోజకవర్గ స్థాయి సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రజలకు చేరువగా పరిపాలన అందించాలన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనతో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించామని తెలిపారు. గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు అధికారులు ప్రజల్లోనే ఉండి సమస్యలను

# ప్రజలు ఎండ తీవ్రత నుండి జాగ్రత్తలు పాటించాలి

## జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఐపీఎస్



**నారాయణపేట ప్రతినిధి మే 02 ప్రజా జ్యోతి**

నారాయణపేట: జిల్లా ప్రజలు ప్రస్తుతం తీవ్ర ఎండల పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని అప్రమత్తంగా ఉండి తగిన జాగ్రత్తలు పాటించాలని జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఐపీఎస్ ఒక ప్రకటనలో సూచించారు.

## బీజేపీ'జనాగ్రహ సభ'ను

# విజయవంతం చేయాలి

## మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ




## ప్రభుత్వ సంక్షేమ పథకాలను

# అర్హులకు లబ్ధి చేకూర్చాలి

## నారాయణపేట జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీను.



### బీజేపీ'జనాగ్రహ సభ'ను

# విజయవంతం చేయాలి

గద్వాల మే 02(ప్రజా జ్యోతి):ఈ నెల 10వ తేదీన సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహించనున్న బీజేపీ'జనాగ్రహ సభ'ను విజయవంతం చేయాలని మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ పిలుపునిచ్చారు.శనివారం గద్వాల పట్టణంలోని డీకే బంగ్లాలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు.ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మూడోసారి పదవీ బాధ్యతలు చేపట్టిన అనంతరం తొలిసారి తెలంగాణకు రానున్నారని,ఈ సందర్భంగా రాష్ట్రంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేయనున్నట్లు తెలిపారు.తెలంగాణ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని అన్నారు.ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు.అధికారం కోసం అబద్ధపు హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేసిందని ఆరోపించారు.కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగట్టేందుకే 'జనాగ్రహ సభ'నిర్వహిస్తున్నామని,ప్రజలు,పార్టీ కార్యకర్తలు భారీగా పాల్గొని సభను విజయవంతం చేయాలని కోరారు.బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఇచ్చిన హామీలను అమలు చేస్తూ సుపరిపాలన అందిస్తున్నందునే ప్రజలు మళ్లీ మళ్లీ అధికారాన్ని కట్టబెడుతున్నారని పేర్కొన్నారు.గ్రామీణాభివృద్ధి కూడా కేంద్ర ప్రభుత్వ నిధులతోనే జరుగుతోందని అన్నారు.పీఎం శ్రీ పథకం కింద పాఠశాలల్లో సైన్స్ ల్యాబ్‌లు,లైబ్రరీలు, డిజిటల్ తరగతులు ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు.తెలంగాణలో సుమారు రూ.7,823 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు ప్రధాని శంకుస్థాపన చేయనున్నారని తెలిపారు.మహిళా రిజర్వేషన్ బిల్లుపై కాంగ్రెస్ వైఖరిని విమర్శిస్తూ,దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఈ బిల్లుకు చిత్తశుద్ధి లేకపోయిందని ఆరోపించారు.బీఆర్ఎస్,కాంగ్రెస్ పార్టీల పాలనతో ప్రజలు నిరాశ చెందారని, ప్రస్తుతం బీజేపీ వైపు చూస్తున్నారని పేర్కొన్నారు.ఈ సమావేశంలో రాష్ట్ర కోశాధికారి దేవకి వాసుదేవరావు,జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు,మాజీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రరెడ్డి,రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు బండల వెంకటరాములు,జిల్లా ప్రధాన కార్యదర్శి రవి కుమార్ ఎక్బోటే,అసెంబ్లీ అభ్యర్థులు బలిగేర శివారెడ్డి,రాజగోపాల్,ఓబీసీ జిల్లా అధ్యక్షుడు దాస్ తదితరులు పాల్గొన్నారు.

### ప్రభుత్వ సంక్షేమ పథకాలను

# అర్హులకు లబ్ధి చేకూర్చాలి

నారాయణపేట ప్రతినిధి మే 02 ప్రజా జ్యోతి

అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేసి ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులకు లబ్ధి చేకూర్చాలని జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీను సూచించారు.

జిల్లాలో కొత్తగా ఎన్నికైన 272 మంది సర్పంచులు, 72 మంది మున్సిపల్ కౌన్సిలర్లలో చాలా మంది చదువుకున్న వాళ్ళు ఉన్నారని, గ్రామాలు, వార్డులలో మంచి పరిపాలన అందించి తమను ఎన్నుకున్న ప్రజల నమ్మకాన్ని నిలబెట్టాలని ఆయన కోరారు. జిల్లా కేంద్రంలోని అంజనా గార్డెన్స్ లో శనివారం ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణలో భాగంగా నియోజక వర్గ స్థాయి కార్యక్రమం నిర్వహించారు. స్థానిక ఎస్ డీ సీ/ఇన్ ఛార్జీ ఆర్డీవో రాజేందర్ గౌడ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీను ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయనతో పాటు మున్సిపల్ చైర్ పర్సన్ కొండా శ్వేతా సత్య యాదవ్, వైస్ చైర్ పర్సన్ మంజుల, మార్కెట్ కమిటీ చైర్మన్ సదా శివారెడ్డి,జెడ్పీ సీ ఈ వో శ్రీనివాస్ రావు,ఆర్టీవో మేఘా గాంధీ, సీపీవో ఖాఘువాహన్, మున్సిపల్ కమిషనర్ శంకర్ పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా సీఎం రేవంత్ రెడ్డి సందేశాన్ని నోడల్ అధికారి రాజేందర్ గౌడ్ చదివి వినిపించారు. అనంతరం రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీను మాట్లాడుతూ.. గత మార్చి 6 నుంచి జూన్ 12 వరకు ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణకు శ్రీకారం చుట్టిందని, అందులో భాగంగా జిల్లాలో మార్చి 6 నుంచి ఇప్పటి వరకు 10 థీమ్స్ తో జిల్లాలో ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక పేరిట వివిధ కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందన్నారు. 99 రోజుల కార్యాచరణ పై అందరికీ అవగాహన కల్పించాలనే ఉద్దేశ్యంతో మార్చి 12 న ప్రజా ప్రతినిధులందరికీ ఒకరోజు ప్రత్యేక కార్యక్రమం నిర్వహించామని ఆయన తెలిపారు. అలాగే ప్రతీ వారం ఒక్కో అంశంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో కార్యక్రమాలు చేపట్టడం జరిగిందన్నారు. ఏప్రిల్ 2 న జిల్లావ్యాప్తంగా అన్ని పంచాయతీ కార్యాలయాల్లో సర్పంచులు, వార్డులలో కౌన్సిలర్ల అధ్యక్షతన గ్రామ, వార్డు సభలు నిర్వహించుకున్నామని, 12న మండల స్థాయిలో, ఈ రోజు నియోజక వర్గ స్థాయిలో, ఈ నెల 26 న జిల్లా స్థాయిలో, జూన్ 2న రాష్ట్రస్థాయిలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని అదనపు కలెక్టర్ వెల్లడించారు. అయితే కొత్తగా ఎన్నికైన సర్పంచులకు పంచాయతీ రాజ్ చట్టంపై మూడు విడతలుగా శిక్షణ కార్యక్రమం నిర్వహించడం జరిగిందని, తన సర్వీసులో ఎప్పుడూ ఇలాంటి శిక్షణ కార్యక్రమం చూడలేదన్నారు. ప్రజలకు మంచి పాలన అందిస్తారని ప్రభుత్వం ఇలాంటి కార్యక్రమాలు చేపడుతుందన్నారు. గ్రామాలలో, వార్డులలో ప్రజా ప్రతినిధులుగా మీ ముద్ర ఉండాలని సర్పంచులు, కౌన్సిలర్లకు ఆయన సూచించారు. గ్రామ, మండల, ప్రస్తుతం నియోజక వర్గ స్థాయి లో జరిగిన ఈ ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, లబ్ధి పొందుతున్న వారి వివరాలు, ఆయా పథకాలకు ప్రభుత్వం కేటాయించిన నిధుల వివరాలతో కూడిన నివేదికలను చాలా స్పష్టంగా వివరించారని చెప్పారు. రైతు భరోసా, మహా లక్ష్మీ, ఇందిరమ్మ ఇండ్లు తదితర పథకాల గురించి వివరించారు. ప్రస్తుతం అమలు చేస్తున్న పథకాలతో పాటు జూన్ 2 రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా ప్రభుత్వం మరికొన్ని పథకాలను ప్రవేశ పెట్టే అవకాశం ఉందని ఆయన తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఇది వరకు అమలు చేస్తున్న మధ్యాహ్న భోజన పథకం తో పాటు అల్పాహారం కూడా ప్రవేశపెట్టనుందని, అలాగే పాఠశాల స్థాయి వరకే అమలు చేస్తున్న మధ్యాహ్న భోజన పథకాన్ని ఇంటర్మీడియట్ వరకు కొనసాగించేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకునే అవకాశం ఉందన్నారు. వీటితో పాటు కొత్తగా కుటుంబ బీమా పథకం అమలు చేయనుందని, పంటల మార్పిడి/సేంద్రియ వ్యవసాయ, అలాగే వికలాంగులు, విద్యార్థులకు వాహనాలు పంపిణీ చేసే అవకాశం కూడా ఉందన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న, చేయబోయే సంక్షేమ పథకాలను అధికారులు ప్రజాప్రతినిధులు కలసి అర్హులకు లబ్ధి చేకూర్చాలని ఆయన పునరుద్ఘాటించారు. ఇక జిల్లాలో ఈ సీజన్ వరి ధాన్యం సేకరణకు 162 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని, జూన్ నెలాఖరు వరకు ఆయా కేంద్రాలలో రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేయడం జరుగుతుందన్నారు. కొనుగోలు చేసిన 24 గంటల లోపు డబ్బులు రైతుల ఖాతాల్లో జమ అవుతాయని అదనపు కలెక్టర్ తెలిపారు. గతేడాది జరిగిన లోటు పాట్లను అధిగమించి ఈ సారి కొనుగోళ్లు సాఫీగా జరిగేలా అన్ని చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. జిల్లాలో ఈ నెల 11 నుంచి జూన్ 9 వరకు జన గణన కొనసాగుతుందని, ఎనిమిరేటర్స్ ప్రతీ ఇంటికి వెళ్ళి ఆయా కుటుంబాల వివరాలు నమోదు చేస్తారని, అంతలోపు ఎవరికి వారే ఆన్ లైన్ లో స్వీయ గణన చేసుకుంటే హౌసింగ్ లిస్ట్ పూర్తవుతుందన్నారు. స్వీయ గణన చేసుకుని, ఐ.డీ. నెంబర్ సేవ్ చేసుకుంటే మన ఇంటికి ఎనిమరేటర్ వచ్చినప్పుడు కేవలం మన ఐడీ నంబర్ చెబితే మన వివరాలన్నీ ఎనిమరేటర్ సులువుగా నమోదు చేసుకునే వెసులుబాటు కలుగుతుందన్నారు. స్వీయ గణన లో రాష్ట్రంలో మిగతా జిల్లాల కంటే మన జిల్లా చాలా వెనుక బడి ఉందని, సర్పంచులు, కౌన్సిలర్లు స్వీయ గణన పై అవగాహన కల్పించి, ఆన్ లైన్ లో వారి వివరాలను నమోదు చేయించాలని ఆయన కోరారు. జిల్లాలో ఈ సారి పదో తరగతి పరీక్షా ఫలితాలు మెరుగ్గా వచ్చాయని, గతేడాది 95 శాతం ఉత్తీర్ణత ఉంటే ఈ సారి 98 శాతానికి పెరిగిందని, ముఖ్యంగా ఉమ్మడి జిల్లాలో నాగర్ కర్నూల్ జిల్లాను మన జిల్లా ఉత్తీర్ణత శాతంలో వెనక్కి నెట్టిందని చెప్పారు. ప్రభుత్వం విద్య పై పెడుతున్న పెట్టుబడి వృథాగా పోదని ఆయన అభిప్రాయ పడ్డారు. జిల్లాలోని మక్తల్ నియోజక వర్గంలో గొల్లపల్లి శివారులో 20 ఎకరాలలో, అలాగే నారాయణ పేట మండలం లోని లింగంపల్లి వద్ద 20 ఎకరాలలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లను నిర్మించబోతుందని, ఆ పాఠశాలలు ప్రారంభమైతే పదో తరగతి పరీక్షా ఫలితాలలో మన జిల్లా మరింత ప్రగతి సాధించడం ఖాయమని అదనపు కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రస్తుతం జిల్లాలో పెరుగుతున్న అధిక ఉష్ణోగ్రతల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచిస్తూ.. ఉదయం 11 గంటలలోపు పనులు పూర్తి చేసుకుని ఇంటికి వెళ్లాలని, ప్రతీ గ్రామంలో ఒక చలి కేంద్రాన్ని ఏర్పాటు చేయాలనే ఆదేశాలు ఉన్నాయని తెలిపారు. వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజా ప్రతినిధులు ప్రజలకు అవగాహన కల్పించాలని ఆయన కోరారు. వేసవిలో ఏదైనా అనుకోని సంఘటన జరిగితే సమీపంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వెళ్ళి తగిన చికిత్స తీసుకోవాలని ఆయన ప్రజలకు సూచించారు. అనంతరం పలువురు చేనేత కార్మికుల కు చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్లు అమరేందర్ కృష్ణ,తిరుపతయ్య, సింధుజా, రామ్ కోటి, ఆయా మండలాల ఎంపీడీవోలు, ఏఈలు, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, నియోజక వర్గానికి చెందిన సర్పంచులు, మున్సిపల్ కౌన్సిలర్లు, సంబంధిత అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

### ప్రజలు ఎండ తీవ్రత నుండి జాగ్రత్తలు పాటించాలి

రాష్ట్రవ్యాప్తంగా ఉష్ణోగ్రతలు గణనీయంగా పెరుగుతున్న నేపథ్యంలో ప్రజల ఆరోగ్యం, భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు.
ఇటీవల అధిక ఎండల కారణంగా ఒక ద్విచక్ర వాహనం అగ్నికి ఆహుతి అయిన సంఘటనను ప్రస్తావిస్తూ, వాహనాలను నేరుగా ఎండలో పార్క్ చేయకుండా చెట్ల నీడలో లేదా షెడ్లలో ఉంచాలని సూచించారు. వాహనాల్లో ఇంధనం, బ్యాటరీలు వంటి భాగాలు అధిక వేడికి గురై ప్రమాదాలకు దారితీయవచ్చని హెచ్చరించారు.
ప్రజలు ముఖ్యంగా మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు అత్యవసర పరిస్థితులు తప్ప బయటకు వెళ్లకుండా ఉండాలని విజ్ఞప్తి చేశారు. బయటకు వెళ్లాల్సి వస్తే తలకు గుడ్డ లేదా టోపీ ధరించడం, చల్లని నీరు తరచుగా తాగడం, ఎలక్ట్రోలైట్ పానీయాలు సేవించడం ద్వారా డీహైడ్రేషన్ నుంచి రక్షించుకోవాలని సూచించారు.
వృద్ధులు, చిన్నపిల్లలు, గర్భిణీలు మరియు అనారోగ్యంతో బాధపడుతున్న వారు మరింత జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ఎండల వల్ల అలసట, తలనొప్పి, తల తిరగడం, వాంతులు వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే సమీప ఆసుపత్రిని సంప్రదించాలని సూచించారు.

## చదువుతో పాటు కళల్లోనూ రాణించాలి

రంగంలో కాకుండా భిన్న రంగాల్లో ప్రతిభ చూపి బహుముఖ ప్రజ్ఞాశాలులుగా ఎదగాలని ఆకాంక్షించారు. విద్యార్థులు నేర్చుకున్న నృత్యం,సంగీతాన్ని వేదికలపై భయపడకుండా ధైర్యంగా ప్రదర్శించాలని సూచించారు.ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహించనున్న విద్యా వారోత్సవాల్లో బాల భవన్ విద్యార్థులకు ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించేలా సన్నాహాలు చేయాలని తెలిపారు.ఈ సందర్భంగా కలెక్టర్ విద్యార్థులతో వారి అభిరుచులు,నేర్చుకుంటున్న అంశాలు,భవిష్యత్తు లక్ష్యాలపై మాట్లాడారు. అంతకుముందు బాల భవన్ పర్యవేక్షకులు విజయలక్ష్మి,పూర్వ విద్యార్థులు రాష్ట్ర, జాతీయ,అంతర్జాతీయ స్థాయిలో సాధించిన విజయాలు,అందుతున్న శిక్షణ వివరాలను వివరించారు.ఈ కార్యక్రమంలో డీఈవో విజయలక్ష్మి,డాక్టర్ అనంతలక్ష్మి, స్థానిక కౌన్సిలర్ మంజుల రాణి,విద్యాశాఖ అధికారులు శ్రీనివాసులు,మైఖేల్,శిక్షకులు పోలోజు సత్యం,శంకర్ పాల్గొన్నారు.

## ప్రజా సంక్షేమమే లక్ష్యం

తెలుసుకుని పరిష్కరించే విధంగా కార్యక్రమం కొనసాగుతోందన్నారు. ఇప్పటికే గ్రామ, మండల స్థాయిలో సమావేశాలు నిర్వహించి, ఇప్పుడు నియోజకవర్గ స్థాయికి విస్తరించామని వివరించారు.
గత రెండున్నర సంవత్సరాల్లో ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించిన ఆయన, పారదర్శకంగా పథకాలను అందిస్తున్నామని అన్నారు. మహిళా సాధికారతకు ప్రాధాన్యతనిస్తూ మహాలక్ష్మి పథకం, ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం వంటి కార్యక్రమాలతో మహిళలకు ఆర్థిక భరోసా కల్పిస్తున్నామని తెలిపారు. ఉచిత ప్రయాణంతో మహిళల ఆదాయం పెరుగుతోందని, రెండు సంవత్సరాల నాలుగు నెలల్లో సుమారు ?10,000 కోట్లు ఆదా అయ్యాయని చెప్పారు.ఇళ్ల అవసరాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ ద్వారా 95% కుటుంబాలు లబ్ధి పొందుతున్నాయని, రైతులకు ?20,000 కోట్లతో రుణమాఫీ అమలు చేసి 25 లక్షల కుటుంబాలకు ఉపశమనం కల్పించామని తెలిపారు. జూన్ 2 నుంచి "ఇందిరమ్మ జీవిత బీమా" పథకం ద్వారా ప్రతి కుటుంబానికి ?5 లక్షల భీమా రక్షణ అందించనున్నట్లు, 1.15 కోట్ల కుటుంబాలు లబ్ధి పొందనున్నాయని చెప్పారు. "ఇందిరమ్మ ఇల్లు" పథకం ద్వారా ఇప్పటికే మహబూబ్‌నగర్‌లో 3500 ఇళ్లు మంజూరు చేశామని పేర్కొన్నారు. విద్యా రంగంలో "శతశాతం" కార్యక్రమంతో పాఠశాలల్లో వాలంటీర్లను నియమించి ప్రత్యేక శిక్షణ అందిస్తున్నామని, దీని ఫలితంగా పదో తరగతి ఫలితాల్లో 90% ఉత్తీర్ణత సాధించామని తెలిపారు. ట్రిపుల్ ఐటీ కళాశాల ఏర్పాటుతో విద్యార్థులకు మెరుగైన అవకాశాలు లభిస్తున్నాయని, ఈ సంవత్సరం ఎక్కువ మంది విద్యార్థులు ఐఐఐటీలో సీట్లు సాధిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారుజిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా మాట్లాడుతూ, ప్రభుత్వ పథకాలు అర్హులైన పేదలకు చేరేలా చేయడమే ప్రజాపాలన లక్ష్యమని అన్నారు. ప్రజల నుంచి ఫీడ్‌బ్యాక్ సేకరించి పథకాల అమలు మరింత సమర్థవంతంగా చేయడం ముఖ్యమని పేర్కొన్నారు. రైతులు, మహిళలు, విద్యార్థులు, పేదల కోసం ప్రభుత్వం అనేక వినూత్న పథకాలు అమలు చేస్తోందని వివరించారు. జిల్లా ఎస్పీ దరావత్ జానకి మాట్లాడుతూ, రోడ్డు భద్రత, ట్రాఫిక్ నియమాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. యువతలో మాదకద్రవ్యాల నివారణకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని, ఎవరైనా అనుమానాస్పద సమాచారం ఉంటే పోలీసులకు తెలియజేయాలని పిలుపునిచ్చారు.

# సప్లిమెంటరీ పరీక్షల్లో 100% ఫలితాలు లక్ష్యం

## -విద్యాశాఖకు కలెక్టర్ ఆదేశాలు



**గద్వాల మే 02(ప్రజా జ్యోతి):**
మార్చిలో నిర్వహించిన పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో అనుతీర్ణులైన విద్యార్థులు రాబోయే సప్లిమెంటరీ పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ విద్యాశాఖ అధికారులను ఆదేశించారు.జిల్లాలో విద్యా ప్రమాణాల మెరుగుదలపై శనివారం కలెక్టర్ అధ్యక్షతన గూగుల్ మీట్ ద్వారా నిర్వహించిన సమీక్ష సమావేశంలో పదవ తరగతి ఫలితాలు,విద్యార్థుల నమోదు,పాఠశాల మౌలిక వసతులపై కీలక సూచనలు చేశారు.

ప్రతి పాఠశాల వారీగా ఫెయిల్ అయిన విద్యార్థుల జాబితాను సబ్జెక్టు వారీగా సిద్ధం చేసి,వారికి 15--20 రోజుల పాటు ప్రత్యేక రీమిడియల్ తరగతులు నిర్వహించి సప్లిమెంటరీ పరీక్షలకు సిద్ధం చేయాలని సూచించారు.వారం రోజుల్లో పరీక్ష ఫీజుల చెల్లింపులు పూర్తి చేయించి,జూన్‌లో జరిగే పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా కృషి చేయాలని ఆదేశించారు.బాలికల కోసం కేజీబీవీలలో భోజన వసతి కల్పించి, బాలురకు ప్రత్యేక పాఠశాలల్లో తరగతులు నిర్వహించాలని తెలిపారు.పదవ తరగతి ఉత్తీర్ణులైన ప్రతి విద్యార్థి ఉన్నత విద్యలో చేరేలా చర్యలు తీసుకోవాలని,ఇంటర్, డిప్లొమా తదితర కోర్సులపై అవగాహన కల్పించి కౌన్సెలింగ్ నిర్వహించాలని సూచించారు.విద్యార్థుల అడ్మిషన్ వివరాలను రోజువారీగా నమోదు చేయాలని ఆదేశించారు.ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా మే 11 నుంచి 17 వరకు నిర్వహించనున్న"ఎడ్యుకేషన్ వీక్"కార్యక్రమాలను విజయవంతం చేయాలని పేర్కొన్నారు.ఈ కార్యక్రమాల్లో మరుగుదొడ్ల నిర్మాణ ప్రారంభం,రీమిడియల్ క్యాంపులు,సర్పంచ్‌లతో వర్క్‌షాప్‌లు,బడిబాట ద్వారా నమోదు పెంపు,లైబ్రరీ దినోత్సవం,ఆర్ట్-క్రాఫ్ట్ కార్యక్రమాలు,బాలభవన్‌లో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు.జిల్లాలోని పాఠశాలల మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి పెట్టి, మరుగుదొడ్లు,మరమ్మతులు,విద్యుత్ సదుపాయాల పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు.అన్ని మండలాల్లో జరుగుతున్న పనులను పీపీటీ రూపంలో నమోదు చేసి,ఫోటోలు,నివేదికలు సమర్పించాలని సూచించారు.విద్యా ప్రమాణాల మెరుగుదలకు ఉపాధ్యాయులు,ఎంఈఓలు,హెచ్‌ఎంలు సమన్వయంతో పనిచేసి, విద్యార్థుల ఉత్తీర్ణత శాతం,నమోదు పెంపు లక్ష్యంగా ముందుకు సాగాలని కలెక్టర్ సూచించారు.ఈ సమావేశంలో డీఈవో విజయలక్ష్మి,ఇతర అధికారులు పాల్గొన్నారు.

## పాగా పుల్లారెడ్డి జయంతి ఘనంగా నిర్వహణ



**గద్వాల మే 02(ప్రజా జ్యోతి):**
జోగులాంబ గద్వాల జిల్లాకు చెందిన ప్రముఖ నిజాం వ్యతిరేక ఉద్యమకారుడు,స్వాతంత్ర్య సమరయోధుడు,మాజీ ఎమ్మెల్యే పాగా పుల్లారెడ్డి జయంతి వేడుకలు జిల్లాలో ఘనంగా నిర్వహించారు.గద్వాల ప్రాంత అభివృద్ధికి విశేషంగా కృషి చేసిన ఆయన,గద్వాలకు తొలి ఎమ్మెల్యేగా ఎన్నికై ప్రజాసేవలో గుర్తింపు పొందారు.ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో ఆయన కుమార్తె డాక్టర్ అనంతలక్ష్మి,జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ సరిత,సీనియర్ సిటిజన్ ఫోరం నాయకులు మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా రెడ్ క్రాస్ సొసైటీ అధ్యక్షుడు అయ్యప్ప రెడ్డి,టీపీఎఫ్ ప్రభాకర్,జి.సవర్ణ విశ్వేశ్వర స్కూల్‌కు చెందిన లచ్చన్న గౌడ్,పద్మన్న,కేశవరెడ్డి,నవోదయ సుధాకర్ తదితరులు పాల్గొని పాగా పుల్లారెడ్డికి ఘన నివాళులు అర్పించారు.

# జనగణన శిక్షణ ప్రారంభం



**చిన్నంబావి, మే 2 (ప్రజా జ్యోతి)**
వనపర్తి జిల్లా చిన్నంబావి మండలంలోని పెద్ద దగడ గ్రామ జడ్పి హైస్కూల్‌లో జనగణన (సెన్సస్) శిక్షణ కార్యక్రమం శనివారం ప్రారంభమైంది. మూడు రోజుల పాటు నిర్వహించనున్న ఈ శిక్షణలో భాగంగా తొలి రోజు కార్యక్రమం విజయవంతంగా సాగింది.మండల ప్లానింగ్ & స్టాటిస్టిక్స్ అధికారి మహేశ్వరి ఆధ్వర్యంలో ఎన్యూమరేటర్, సూపర్వైజర్లకు జనగణన శిక్షణ తరగతులు ఈ సందర్భంగా మాట్లాడుతూ శిక్షణలో ప్రతి అంశాన్ని అవగాహన కల్పించుకోవాలని సూపర్వైజర్లకు చూపించారు ప్రశ్నలు సమాధానాలు రూపంలో జనగణనకు సంబంధించి వారి సందేశాలను నివృత్తి చేశారు. అనంతరం సిబ్బందికి సెన్సస్ కిట్లు పంపిణీ చేశారు. జనాభా లెక్కల నమోదులో పాటించాల్సిన విధానాలపై అవగాహన కల్పించారు.జనగణన ఇన్చార్జి ఆఫీసర్ తహశీల్దార్ శ్రీనివాసులు, ఫీల్డ్ ఆఫీసర్లు నాగరాజు, రవి పాల్గొని సిబ్బందికి ప్రాథమిక మార్గదర్శకాలు అందించారు. డేటా సేకరణలో ఖచ్చితత్వం, సమగ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని తెలిపారు. జనగణన కార్యక్రమం విజయవంతం కావాలంటే ప్రతి ఒక్కరూ తమ బాధ్యతలను నిబద్ధతతో నిర్వర్తించాలని అధికారులు సూచించారు. మూడు రోజుల శిక్షణ అనంతరం సిబ్బంది ఫీల్డ్ స్థాయిలో సమర్థంగా పనిచేయగలరని ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ఉపాధ్యాయురాలు తదితరులు పాల్గొన్నారు.

## క్రికెట్ టోర్నమెంట్ విజేతలకు బహుమతులు అందజేసిన వడ్డేమాన్ రామకృష్ణ



**చిన్నంబావి మే 2 (ప్రజాజ్యోతి)**
చిన్నంబావి మండల పరిధిలోని కొప్పునూర్ గ్రామంలో నిర్వహించిన కే.పీ.ఎల్ క్రికెట్ టోర్నమెంట్ ఉత్సాహభరితంగా ముగిసింది. హోరాహోరీగా సాగిన పోటీల్లో జై శ్రీరామ్ టీం అద్భుత ఆటతీరుతో విజేతగా నిలిచి కప్‌ను సొంతం చేసుకుంది.ఈ సందర్భంగా యువతను ప్రోత్సహిస్తూ వడ్డేమాన్ రామకృష్ణ గారు విజేతలకు రూ.6016, రన్నర్స్‌కు రూ.4016 నగదు బహుమతులు అందజేశారు. విజేతలు, రన్నర్స్‌కు ట్రోఫీలు అందించిన వాటర్ మ్యాన్ గోపాల్ గారికి నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు.పట్టు టీమ్ సభ్యులు కూడా తమవంతుగా విజేతలకు, రన్నర్స్‌కు రూ.1000 చొప్పున నగదు బహుమతులు అందజేసి క్రీడా స్ఫూర్తిని చాటిచెప్పారు. టోర్నమెంట్‌ను సమర్థవంతంగా నిర్వహించిన మేనేజ్మెంట్‌ను గ్రామస్తులు అభినందించారు. 11 స్టార్ టీం కూడా మంచి ప్రతిభ కనబరిచిందని, తదుపరి పోటీల్లో విజయం సాధించాలని ఆకాంక్షించారు.ఈ టోర్నమెంట్ గ్రామ యువతలో క్రీడలపై ఆసక్తిని పెంపొందించిందని గ్రామ పెద్దలు తెలిపారు.

# నకిలీ ధ్రువపత్రాల గుట్టురట్టు

## ప్రింటింగ్ ప్రెస్‌పై రెవెన్యూ దాడులు



అయిజ మే 02(ప్రజా జ్యోతి):జోగులాంబ గద్వాల జిల్లా అయిజ మున్సిపాలిటీ కేంద్రంలో నకిలీ ధ్రువపత్రాలు తయారు చేస్తున్న లక్ష్మీ నరసింహ ప్రింటింగ్ ప్రెస్‌పై రెవెన్యూ అధికారులు దాడి చేసి గుట్టురట్టు చేశారు.శనివారం మండల తహసీల్దార్ ఎన్.జ్యోతి ఆదేశాల మేరకు రెవెన్యూ ఇన్స్పెక్టర్ రజినీకాంత్ రెడ్డి,జీపీవోలు కలిసి ప్రింటింగ్ ప్రెస్‌పై తనిఖీలు నిర్వహించారు.ఈ దాడుల్లో వివిధ శాఖలకు చెందిన గవర్నమెంట్ డాక్టర్లు,సర్పంచులు,హెడ్మాస్టర్లు,మ్యారేజ్ సర్టిఫికెట్లు,ఆధార్ కార్డులు, ఎస్ఎస్సీ మెమోలు తదితర నకిలీ ధ్రువపత్రాలకు సంబంధించిన సుమారు 18 ముద్రలను స్వాధీనం చేసుకున్నారు.అదేవిధంగా కంప్యూటర్‌ను పరిశీలించగా సుమారు 150కు పైగా నకిలీ పత్రాలు తయారు చేసినట్లు గుర్తించారు.అనంతరం కంప్యూటర్ సహా ఇతర సామగ్రిని స్వాధీనం చేసుకుని తదుపరి దర్యాప్తు కోసం పోలీసు శాఖకు అప్పగించినట్లు అధికారులు తెలిపారు.ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ, విశ్వసనీయ సమాచారం,ఫిర్యాదు మేరకు ఈ దాడులు నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఇలాంటి అక్రమ కార్యకలాపాలకు పాల్పడిన వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఈ దాడుల్లో రెవెన్యూ ఇన్స్పెక్టర్‌తో పాటు జీపీవోలు జ్యోతి,రహమతుల్లా,బాలు,తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల్లో ఎమ్మెల్యే జీఎంఆర్ పర్యటన

అడ్డకల్, మే 2 (ప్రజా జ్యోతి ): దేవరకద్ర నియోజకవర్గంలో ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి పర్యటించారు. అడ్డాకుల మండలం రామచంద్రపురం గ్రామంలో నిర్వహించిన ఇందిరమ్మ ఇండ్ల గృహ ప్రవేశ కార్యక్రమంలో పాల్గొని, లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం మూసాపేట్ మండలం పోల్కంపల్లి గ్రామంలో జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి యాదయ్య తల్లి దశదినకర్మ కార్యక్రమంలో పాల్గొని, కుటుంబ సభ్యులకు పరామర్శలు తెలియజేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమాల్లో నాయకులు విజయమోహన్ రెడ్డి, అడ్డాకుల గ్రామ సర్పంచ్ దశరథ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## వివాహ రిసెప్షన్...వేడుకల్లో పాల్గొన్న. అనుకులి శివరాముడు. ఎస్ శ్రీనివాసులు

చిన్నంబావి మే 2 (ప్రజా జ్యోతి)
చిన్నంబావి మండల పరిధిలోని పెద్దమారూర్ గ్రామంలో శనివారం మాజీ ఎంపీపీ సోమేశ్వరమ్మ, మధుసూదన్ రెడ్డి ఆహ్వానం మేరకు వారి కుమారుడు గణేష్ రెడ్డి - సాయి సుమన రెడ్డి రిసెప్షన్ వేడుకలకు హాజరై నూతన దంపతులను ఆశీర్వదించారు అనుకలి శివరాముడు, ఎస్ శ్రీనివాసులు,కే జగన్ మోహన్,డి బాలరాజు, రామచందర్, మోహన్ యాదవ్, శివకృష్ణ,జయ రాములు, జంబులయ్య తదితరులు పాల్గొన్నారు



# నారాయణ పేటలో ఘనంగా పూలే అంబేద్కర్ 4వ జాతర భీమ్ ర్యాలీ

**అంబేద్కర్ ఆశయాలు సాధించేందుకే జాతర కొనసాగించాలి**

**విశారదన్ మహరాజ్**



**నారాయణపేట ప్రతినిధి మే 02 (ప్రజా జ్యోతి)**
నారాయణ పేట జిల్లా కేంద్రంలో పూలే అంబేద్కర్ 4వ జాతర సందర్భంగా భారీ భీమ్ ర్యాలీని భారం భావి నుండి శీల గార్డెన్ వరకు జాతర కమిటీ నిర్వహించారు.ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా విచ్చేసిన విశారదన్ మహరాజ్ మాట్లాడుతూ దేశంలో అణగారిన వర్గాల కోసం కలలు కన్నా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆశయాలను నేటి యువత ఉనికిపించుకోవాలని ఆయన ఆశయ సాధన బాటలో నడవాలని పిలుపునిచ్చారు, అలాగే దేశంలో రాష్ట్రంలో పాలిస్తున్న పాలకులు ఎస్సీ, ఎస్టీ బీసీ మైనారిటీ వర్గాల హక్కులను కాల రాస్తున్నారని ఆయన అన్నారు , అంబేద్కర్ జాతర అంటే అన ఆశలను ఆయన కోరుకున్న సిద్ధాంతాలను ఉనికిపించుకోవాలని అలాంటి యువత నారాయణపేటలో ప్రతి సంవత్సరం అంబేద్కర్ జాతర నిర్వహించడం గొప్ప విషయమని జాతర నిర్వహిస్తున్న జాతర కమిటీకి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు,జాతర కమిటీ అధ్యక్షులు యు. మహేష్, ప్రధాన కార్యదర్శి చిన్నయ్య,కమిటీ నాయకులు మాట్లాడుతూ.. గత నేల నుండి జాతర నిర్వహణ కు జిల్లా లోని దామరగిద్ద,నారాయణపేట, మద్దూరు,కోస్గి,కొత్తపల్లి, ఉట్కూరు,ధన్వాడ,మక్తల్, మరికల్,మిగతా మండలలో గ్రామాలలో కమిటీలు వేసి జాతర నిర్వహణ కు నాయకులు కృషి చేశారు.పూలే,అంబేద్కర్ ఆశయాలు సాధన,రాజ్యాంగం రక్షణ కోసం జాతర ను ప్రతి సంవత్సరం నిర్వహిస్తున్నామన్నారు.ప్రజానాట్యమండలి,కళాకారుల డప్పుల కార్యక్రమం ఆకర్షణగా నిలించింది.ఈ కార్యక్రమంలో మహిళలు, యువకులు ఉత్సాహంగా పాల్గొని ర్యాలీని ఘనంగా విజయవంతంగా నిర్వహించారు.

## నీట్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

**- కలెక్టర్ ఖుష్బూ గుప్తా ఆదేశాలు**
**- భద్రత, మౌలిక వసతులపై కట్టుదిట్టమైన ఏర్పాట్లు...**
**- పరీక్ష రాయనున్న 4,214 మంది అభ్యర్థులు**



మహబూబ్‌నగర్, మే 2 (ప్రజా జ్యోతి బ్యూరో): జిల్లాలో మే 3న నిర్వహించనున్న జాతీయ స్థాయి మెడికల్ ప్రవేశ పరీక్ష నీట్ యుజి ను ఎటువంటి లోటుపాట్లు లేకుండా పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా సంబంధిత అధికారులను ఆదేశించారు.కలెక్టర్ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో పరీక్షా కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లు, ప్రధానోపాధ్యాయులు, అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. జిల్లాలోని 12 పరీక్షా కేంద్రాల్లో అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేసి పరీక్షలను సజావుగా నిర్వహించాలని సూచించారు. పరీక్షా కేంద్రాల్లో సీసీటీవీ కెమెరాలు, జ్యామర్లు, బయోమెట్రిక్ హాజరు వ్యవస్థలు ఏర్పాటు చేసి అవి సక్రమంగా పనిచేస్తున్నాయో లేదో నిర్ధారించుకోవాలని తెలిపారు. నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా చూడాలని, అభ్యర్థుల తనిఖీ (ఫ్రిస్కింగ్) కోసం బ్యాకప్ ఏర్పాట్లు కూడా సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. అభ్యర్థులకు తాగునీరు, మరుగుదొడ్లు వంటి మౌలిక వసతులు కల్పించడంతో పాటు తరగతి గదుల్లో సరిపడా కుర్చీలు, టేబుల్లు ఏర్పాటు చేయాలని, ఫ్యాన్లు, లైట్లు సరిగా ఉన్నాయో ముందుగానే పరిశీలించాలని సూచించారు. పరీక్షల పారదర్శక నిర్వహణ కోసం పోలీస్ శాఖ ద్వారా కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. జిల్లాలో నిర్వహించే నీట్ పరీక్షకు మొత్తం 4,214 మంది అభ్యర్థులు హాజరుకానుండగా, అందులో 25 మంది దివ్యాంగులు ఉన్నారు. వారికి అదనంగా ఒక గంట సమయం కల్పించి సాయంత్రం 6 గంటల వరకు పరీక్ష రాసే అవకాశం ఇస్తారు. పరీక్ష నిర్వహణ కోసం 372 మంది ఇన్విజిలేటర్లు, 13 మంది పరిశీలకులను నియమించినట్లు తెలిపారు.

అభ్యర్థులకు సూచనలు:
అభ్యర్థులకు ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు మాత్రమే పరీక్షా కేంద్రాల్లోకి ప్రవేశం ఉంటుంది. అనంతరం గేట్లు మూసివేస్తారు. పరీక్ష మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరుగుతుంది. మొబైల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాలు, గడియారాలు, కాలిక్యులేటర్లు, ఆభరణాలు, అనుమతి లేని వస్తువులు తీసుకురావద్దని సూచించారు. పరీక్షా కేంద్రాల్లోనే పెన్నులు అందజేస్తారు. హాల్ టికెట్‌తో పాటు ఆధార్, ఓటర్ ఐడి వంటి గుర్తింపు కార్డులు తీసుకురావాలని, నిర్దేశిత డ్రెస్ కోడ్ పాటించాలని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియా, డీఆర్వో రాం రెడ్డి, జిల్లా నీట్ నోడల్ అధికారి వై. సురేందర్, చీఫ్ సూపరింటెండెంట్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# కాలనీ వాసుల సమస్యలను పరిష్కరించడమే లక్ష్యం

**-- నూతన విద్యుత్ స్తంభాలకు వైర్ల కనెక్షన్ ఏర్పాటు**
**-- వీధి స్తంభాలకు బల్బులు అమర్పించిన కౌన్సిలర్ సుంకరి**

నాగర్ కర్నూల్ మే 2 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి)
నాగర్ కర్నూల్ జిల్లా అచ్చంపేట మున్సిపల్ పరిధిలోని రెండో వార్డులో కౌన్సిలర్ సుంకరి నిర్మల బాలరాజ్ కాలనీలోని సమస్యలను పరిష్కరించడమే ఏకైక లక్ష్యం అన్నారు. శనివారం స్థానిక ఎమ్మెల్యే వంశీకృష్ణ ఆదేశాల మేరకు విద్యుత్ శాఖ అధికారులు నూతన స్తంభాలకు వైర్లు బిగించి మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో వీధి స్తంభాలకు బల్బులను ఏర్పాటు చేయడం జరిగిందని కౌన్సిలర్ సుంకరి నిర్మల బాలరాజ్ స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండో వార్డులో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కాలనీలో మాలిక వసతులైన, డ్రైనేజీ విద్యుత్ దీపాలు సిసి రోడ్ల మౌలిక కల్పనకు ఎమ్మెల్యే సహకారంతో ఏర్పాట్లను పూర్తి చేస్తున్నానని కౌన్సిలర్ సుంకరి నిర్మల బాలరాజ్ వ్యాఖ్యానించారు. కాలనీలో సంక్షేమం అభివృద్ధిలో ఎప్పటికప్పుడు పరిష్కరించే విధంగా తమ ప్రయత్నాలు కొనసాగుతున్నాయని ఆయన పేర్కొన్నారు. అదేవిధంగా కాలనీవాసులకు నిజమైన లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు అందే విధంగా కృషి చేస్తున్నానని ఆయన అన్నారు. రెండో వార్డు నుంచి తమను రెండు మార్లు కౌన్సిలర్గా గెలిపించిన కాలనీవాసులకు ఎప్పటికీ రుణపడి ఉంటామన్నారు. అదేవిధంగా రాబోయే ఎన్నికల్లో కూడా తమ దీవెనలు మాపై ఉండాలని కాలనీవాసులకు ఆయన విజ్ఞప్తి చేశారు. బల్బుల ఏర్పాటు కార్యక్రమంలో కౌన్సిలర్ కాలనీవాసులు మున్సిపల్ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు



# అర్ధరాత్రి దొంగల హల్చల్...

**భయాందోళనలో నంచర్ల గ్రామం**
**నెల రోజుల్లో మళ్లీ మళ్లీ దొంగతనాలు...**

**మహమ్మదాబాద్, ఏప్రిల్ 2 (ప్రజా జ్యోతి ):**
మహమ్మదాబాద్ మండలంలోని నంచర్ల గ్రామంలో దొంగలు మరోసారి రెచ్చిపోయారు. శుక్రవారం అర్ధరాత్రి సమయంలో నెంబర్ ప్లేట్ లేని తెల్లని కారులో వచ్చిన దుండగులు, మేకల కాపరి రెహమాన్‌కు చెందిన మేకలను ఎత్తుకెళ్లారు. మేకల అరుపులు విని అప్రమత్తమైన రెహమాన్ కేకలు వేయడంతో చుట్టుపక్కల గ్రామస్తులు వెంటనే స్పందించి రెండు బైక్‌లపై దొంగలను వెంబడించారు. అయితే దుండగులు వేగంగా పరారవడంతో వారిని పట్టుకోలేకపోయారు.
నంచర్ల ఎక్స్‌రోడ్డు వద్ద గస్తీలో ఉన్న పోలీసులకు సమాచారం అందించగా, పోలీసులు కూడా కారును వెంబడించారు. అయినప్పటికీ దొంగలు మహమ్మదాబాద్ దాటి హన్వాడ వైపు పారిపోయినట్లు సమాచారం.
నెల రోజుల వ్యవధిలో ఇదే తరహా దొంగతనాలు పునరావృతమవుతున్నాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో జరిగిన కేసులపై ఇప్పటివరకు ఎలాంటి పురోగతి కనిపించలేదని పోలీసుల పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.పశువులను కాపాడుకోవడానికి రాత్రిళ్లు నిద్ర లేకుండా కంటిమీద కునుకు లేకుండా గడుపుతున్నామని గ్రామస్తులు చెబుతున్నారు. వెంటనే పోలీసులు గస్తీని పెంచి దుండగులను పట్టుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

# మహిళలు,పిల్లల భద్రతపై భరోసా సెంటర్ సిబ్బంది అవగాహన




గద్వాల మే 02(ప్రజా జ్యోతి ప్రతినిధి):తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా మహిళల భద్రత,పిల్లల భద్రత,మాదక ద్రవ్యాల నిర్మూలనపై అవగాహన కల్పించేందుకు శనివారం జిల్లా మహిళా భరోసా సెంటర్ సిబ్బంది జిల్లా ఎస్పీ టి.శ్రీనివాస రావు ఆదేశాల మేరకు జిల్లా కేంద్రంలోని పబ్లిక్ ప్రదేశాల్లో కార్యక్రమాలు నిర్వహించారు.ఈ సందర్భంగా పని ప్రదేశాల్లో లైంగిక వేధింపులకు గురైనపుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు,పాక్సో చట్టం ప్రాముఖ్యత, సహాయం కోసం ఎలా సంప్రదించాలి వంటి విషయాలపై అవగాహన కల్పించారు. మహిళలపై ఎలాంటి వేధింపులు జరిగినా వాటిని ఉపేక్షించకుండా పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు.ఫిర్యాదు చేస్తేనే ఇలాంటి ఘటనలను అరికట్టవచ్చని తెలిపారు.అలాగే మహిళల భద్రత కోసం చట్టాలు బలోపేతం చేయబడ్డాయని గుర్తు చేస్తూ,లింగ సమానత్వంపై వివరించారు.సైబర్ క్రైమ్,సామాజిక మాధ్యమాల వల్ల కలిగే నష్టాలపై అవగాహన కల్పించారు.టోల్ ఫ్రీ నంబర్లు 100,1098,1930 ప్రాముఖ్యతను వివరించారు.ఈ కార్యక్రమంలో భరోసా అకౌంటెంట్ శ్వేత,స్రవంతి, కవిత,స్టానిక ప్రజలు పాల్గొన్నారు.

# ఏపీఎం వేధింపులు భరించలేమంటూ వీఓఏల ఆవేదన.!

**– డీఆర్‌డీఏ పీడీకి ఫిర్యాదు... అక్రమ వసూళ్లపై విచారణకు డిమాండ్**

**మహమ్మదాబాద్, మే 2 (ప్రజా జ్యోతి ):**
ఏపీఎం వేధింపులు భరించలేమంటూ వీఓఏలు శనివారం కలెక్టరేట్‌లో డీఆర్‌డీఏ పీడీ నర్సింహులను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఏపీఎం నిర్మల వీఓఏలపై తీవ్ర ఒత్తిడి తెచ్చి రూ.50 వేల రూపాయలు వసూలు చేయించిందని ఆరోపించారు. మండల వీఓఏల అధ్యక్షుడు వెంకట్రాములతో ఫోన్‌పే ద్వారా డబ్బు చెల్లింపులు చేయించిందని తెలిపారు. అనంతరం ఆ మొత్తాన్ని ఆన్‌లైన్‌లో తిరిగి చెల్లించి, నగదుగా ఇవ్వాలని ఒత్తిడి చేసి బెదిరించిందని పేర్కొన్నారు.భయంతో వెంటనే రూ.50 వేలు నగదుగా అందజేశామని, అయినప్పటికీ మరిన్ని డబ్బులు ఇవ్వాలని వేధింపులకు గురిచేస్తోందని వీఓఏలు ఆవేదన వ్యక్తం చేశారు. మహిళా సమాఖ్య లోన్ల విషయంలో కూడా అక్రమంగా తీసుకున్నట్లు చూపిస్తూ లక్షల రూపాయలు డిమాండ్ చేస్తోందని తెలిపారు. తన మాట వినకపోతే పోలీసు కేసులు పెట్టించి ఉద్యోగాలు కోల్పోయేలా చేస్తానని బెదిరిస్తోందని ఆరోపించారు.ఏపీఎం నిర్మల అక్రమాలపై సమగ్ర విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని వీఓఏలు డీఆర్‌డీఏ అధికారులను కోరారు.

